# జగమే మాయ

-సిహెచ్.డి.లక్ష్మణరావు

సురేందర్ అటవీశాఖ అధికారిగా పనిచేస్తున్నాడు.

డెంకాడ మండలంలో గల కొండ ప్రాంతంలో రెండువందల మొక్కలు నాటించి, మరో మండలంలో మొక్కలు నాటడానికి సన్నాహాలు చేపట్టాడు.

జిల్లాలో అన్ని మండలాల్లో గల కొండ ప్రాంతాల్లో బాగా మొక్కలు పెంచినందుకు సురేందర్ అధికారుల మన్ననలకు పాత్రుడయ్యాడు.

అటు ఉద్యోగబాధ్యతే కాకుండా సొంతంగా 'మొక్కలు పెంచండి- ప్రకృతిని రక్షించండి', 'మనిషి మనుగడ సాగాలంటే మొక్కలు పెంచి తీరాలి', 'చెట్లే మన తోబుట్టువులు' నినాదాలతో ప్రతి ఊర్లోనూ ప్రచారం చేసి మొక్కలు నాటిస్తున్నాడు సురేందర్.

ఆయన కృషి వలన అక్కడక్కడా పచ్చదనం ఇప్పుడిప్పుడే చోటు చేసుకుంటోంది.

రాత్రయ్యింది.

ఇల్లు చేరాడు సురేందర్.

వేన్నీళ్ళతో స్నానం చేసి వేడి వేడి భోజనం కానిచ్చి వాలు కుర్చీలో నడుం వాల్చాడు.

"ఈరోజు ఎక్కువ తిరిగినట్టున్నారు. మాట చూసి నీరసం, మొహం చూసి అలసట ఇట్టే చెప్పొచ్చు" పువ్వులు కడుతూ అంది భార్య మాలతి.

"ఆయాసం మిగులుతుంది తప్ప ప్రయోజనం దక్కడం లేదు. మొక్కలిచ్చి పెంచండర్రా అంటే జనాలకి నిర్లక్ష్యం. అయినా వదలకూడదు. జనాల్ని జాగృతపరచాలి" ఉపోద్ఘాతం ఉప్పెనలా సాగుతోంది.

"మొక్కల మీద మీకెంత మమకారమండీ" మాలతి ప్రశంస పారేసి నిద్రకుపక్రమించింది.

ఆ ప్రశంస ఎంతో ఉపశమనం ఇచ్చింది.

ఆలుమగలు అలా మాట్లాడుకుంటూ నిద్రలోకి జారుకుంటున్నారు.

తేరగా వచ్చిన డబ్బు ఖర్చు చేస్తే విలువ తెలీదు. కష్టపడి సంపాదించిన డబ్బులు ఖర్చు చేస్తే ఆ విలువ బోధపడుతుంది.

కష్టించిన వాడికి ప్రశంస కూడా అటువంటిదే.

"ఉద్యోగంలో పడి భార్య, ఇల్లు గుర్తుంటాయా?" మగత నిద్రలో భార్య అంది.

"నీది మరీ చోద్యం" మగత నిద్రలోనే జవాబిచ్చాడు భర్త.

ఒకప్పుడు విజయనగరం జిల్లాలో ఎన్నో తోటలు ఉండేవి.

అందమైన ప్రదేశాలన్నీ ఇండ్ల స్థలాల్లకై ప్లాట్లు వేస్తున్నారు.

చెట్లన్నీ ముక్కలై, చెక్కలై తలుపు రెక్కలుగా జన్మనెత్తుతున్నాయి.

పిక్నిక్‌లకి వెళ్ళిన పిల్లలు చెట్లెక్కి ఆడుకునే ఆనందం ఇప్పుడెక్కడుంది?

* * *

సురేందర్‌ని జిల్లాలో చెట్ల పెంపకం ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కొత్త ఉద్యోగం.

టౌన్‌లో ఇల్లు ఎవరైనా కట్టాలంటే హౌస్ ప్లాన్‌తో పాటూ సురేందర్ పర్మిషన్ పొందాలి. పర్మిషన్ పొందడానికి నిబంధన ముందుగా స్థలంలో రెండు మొక్కలు యధావిధిగా పెంచాలి. ఆ మొక్కలు మూడడుగులు పెరిగిన తర్వాత ఇల్లు కట్టుకోవడానికి పర్మిషనిస్తారు.

ఈ నియమంతో ప్రజలు బెంబేలెత్తినా శాసించిన తర్వాత చేసేదేముంది?

ప్రతీవాళ్ళూ వాళ్ళ స్థలాల్లో మొక్కలు వేశారు.

సురేందర్ తనిఖీ చేస్తూ చూసి సంతోషపడ్డాడు.

పదిరోజులు గడిచాయి.

సోమం తన స్థలంలో ఇల్లు కట్టుకోవాలని అనుమతి కోసం వచ్చాడు.

"నియమ నిబంధనలు తెలుసా?" అడిగాడు సురేందర్.

"అన్నీ తెలిసే వచ్చానండి. మొక్క మూడడుగులు దాటింది. హైబ్రీడ్ మొక్క సార్! చూడండి" చెప్పాడు సోమం.

ఆ మాటలు నమ్మబుద్ధి వేసినా, ఉద్యోగ బాధ్యత ప్రకారం ఇల్లు కట్టడానికి ఆర్డరిచ్చాడు.

సోమం అర్జంట్‌గా పునాదులు వేసి చకచకా చేసుకోవలసిన పనులు చూసుకోసాగాడు.

వారంరోజుల తర్వాత ప్లాట్లన్నీ పరిశీలిస్తూ సురేందర్ ఇంటి ముందాగి "మొక్కలకి నీళ్ళు పొయ్యండయ్యా. పునాదులెలాగూ తడుపుతున్నారుగా.. మొక్క వెయ్యగానే సరికాదు సంరక్షణ ముఖ్యం"

సోమం తల ఊపడం తప్ప జవాబివ్వలేదు.

"ఈ హైబ్రీడ్ మొక్కలు అందరికీ ఇప్పించు. వాళ్ళూ కట్టుకోవడం ప్రారంభిస్తారు. మనిషన్న తర్వాత పదిమందికీ సాయపడాలి" ఉపోద్ఘాత మిస్తూ జీపెక్కి కదిలాడు సురేందర్.

హైబ్రీడ్ మొక్కల పుణ్యమా అని మరో వంద ఇళ్ళు ఆర్డర్ పొందాయి.

* * *

రోజులు గడుస్తున్నాయి.

సురేందర్ ఊరంతా తిరిగి సోమం ఇంటి ముందాగి, మొక్కని పరీక్షించి చూశాడు.

"మొక్క మారిందేమిటి?" సోమంని అడిగాడు.

సురేందర్ అనుమానాన్ని కొట్టిపారేశాడు సోమం.

సోమం ఇల్లు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

సురేందర్ అనుమానం బుర్రని తొలిచేస్తోంది.

సురేందర్ రాత్రికి ఎవరికంటా పడకుండా సోమం వేసిన మొక్క ఫోటో తీశాడు.

వారంరోజులు గడిచాయి.

ఫోటోలోని మొక్క ఒకటి, అక్కడున్నది మరొకటి.

ఏమిటో ఈ చెట్టు మాయ... ఆలోచించసాగాడు సురేందర్.

రోజూ రాత్రిపూట ఎవరికంటా పడకుండా ఒక్కడే వెళ్ళి చూసి రావడం పనిగా పెట్టుకున్నాడు సురేందర్.

ఒకరోజు రాత్రి సోమం ఎండిన మొక్కని తీసేసి, అదే స్థానంలో అంత పొడవున్న మొక్క మరొకటి వేశాడు.

ఇది చూసి ఆశ్చర్యపోయాడు సురేందర్.

'ఎంత అవినీతి? భగవంతుడు కూడా అవినీతిని అంతమొందిద్దామని అవతారమెత్తినా అతనికీ భారమవుతుందేమో!'

* * *

మర్నాడు సురేందర్ ఆఫీసులో కూర్చుని ఆలోచిస్తున్నాడు.

ఇప్పటికే అయిదు వందల ఇళ్లకి పర్మిషనిచ్చాం. సోమం మీద చర్యలు తీసుకుందామంటే-

"చూడకుండా పర్మిషన్ ఇచ్చారా?" అని అధికారులు ఆగ్రహం ఒకవైపు.

"లంచం ఎంత ముట్టిందో?" అని లోకులు కాకుల్లా అరవొచ్చు.

ఆలోచిస్తూ టేబుల్ మీదున్న కాగితాలు తిరగేస్తుంటే సోమం దరఖాస్తు దర్జాగా కనబడింది.

"అయ్యా.. నేను వేసిన మొక్క ఈమధ్యనే ఎవరో పీకి పారేశారు. మళ్ళీ సమాన వయసు గల హైబ్రీడ్ మొక్క వేశాను. తేడా వచ్చి మొక్క చచ్చిపోతే మేం బాధ్యులం కాం. మా ఇంటి నిర్మాణం ఆపకూడదని మా ఇళ్ళ సంఘం విజ్ఞప్తి"

ఇట్లు

సంఘ అధ్యక్షుడు

-సోమం

సురేందర్ దిగ్భ్రాంతి చెందాడు. ప్రజలకి ఎన్ని తెలివితేటలు?

అప్పుడే దూరంగా మైకులో నుండి 'జగమే మాయ...బ్రతుకేమాయ వేదాలలో సారమింతే నయా..' చక్కగా పాట వినబడుతోంది.

'పెరుగుట-విరుగుట కొరకే' అన్నారు పెద్దలు అవినీతికి పట్టం కట్టి, ఆనందపడే సమాజం?

★

